# ఖామోష్

సిక్కని సిగురుల్లో పొద్దువాటారింది.

సింతల్లి తోపులో సీకటి వొడిచింది. పికిలి పిట్ట పల్లకుంది. సిలక టెక్క ముడుసుకుంది. గువ్వగూడెక్కింది. సుట్టు గుడిసెలో దివ్వెలిగింది – ఏడకే, ఏడకే సినదాన –

సేతిగాజులు సిటిలె–సెంపకందిపోయే – మొగాన దూమెరుగులేదు. సూపులో నిగారం లేదు – ఎవరే బిడ్డా నీవు.

ఐనవాడు కాలరాసినాడా – కానివోడు కంటజూసి నాడా – నీ నరాలు మూగమూలుగాయె. కూతురా, ఏందమ్మా నీయాతన – కన్నతల్లి యిసంబెట్టెనా – కన్నతండ్రి కాసుకమ్మజూపెనా – కూనా, మణుసులన్న యిసుగేసి, బతుకన్న యిషమేసి,. కాలికి బలపం గట్టుకుని, ఏటిపాయలో లోతుచూసి ఒక్క దుముకు దుముకుదమని వచ్చినావా? – ఏందమ్మా కత?

అఁ...కతే! అవ్వా, సకినెం సెప్పినట్టు పలికినావ్. నన్ను కన్నామె సత్తెంగనే యిసం పెడతానన్నది – ఎందుకంటావా, అయమ్మకు ఒకేలు యిడిసినోడు – తమ్ముడు లాటోడు – తలకు మాసినోడు – నన్నిలసు కుంటనన్నడట.

పదికరుకులు నిలుసున్నపళాన బయాన యిచ్చెనే – తాళికట్టేకట్టంగనే పదపిల్ల కాసులు ముట్టజెప్పతనన్నడే – ఏం, తీపు దిగెల్లిందా! నిన్ను ఆడికి కట్టాక మాననంటే – మాననంది, మాయమ – సయ్యాన మాయమ్మ.

కాకులు దన్నంగ గెద్దలుదన్నంగ పల్లేపొడూ దుమ్ము జ్వెరిగిన బతుకు ఆడిది. మణుసుల్లో మణిసికాడు. నరుల్లో నరుడుకాడు. నడీదిని తలెత్తుకు తిరగలేడు. నాకీడుకాదు. జోడుకాదు. అడ్డు – నాకేలనే అంటిని, మాయమ్మ ససేమిరా – అనె.

నీ మాట మార్చుకో అని గెడ్డమంటి బతిమిలాడినా – ఓసీ ధగిడీ, నీ బుద్ధి మార్చుకో అని ఛెళ్ళునేసింది – యిసమన్నా తాగేను కాని అందుకొల్ల నంటిని. అట్టనే తాగమంది. గన్నేరు పసరుదీసి ఇచ్చింది కాని నోటపట్టలేక పోతిని. గంద్రసేదు – యిసం – అమ్మా కూసంత సక్కెరట్టుకు రాయే అంటిని. పకాలుమనె సావబోతూ సక్కెర కావాలా అని, మాడున మొట్టె బతుకో పాడో తీయంగ గడిసిపాయె–అట్టనే కన్ను మూయనీ అంటిని. సక్కెరకు పైసా ఏడదే అని మా అవ్వ మోరాయించె – మా అయ్య నడిగినా – ఎందుకనె – అందుకంటిని.

అప్పాడెంత రగడాయె – ఆ మణిసి మాయమ్మ కొప్పాసిగ అంకించుకొనె – ఏమే అబిసీ, నా బిడ్డను అంత కారు సొకగ బేరమిచ్చినావంటే – నా కూన

పదికాసులేనా పలికేది – అని లెక్కేసి కాసుకో తాపిచ్చి, మాయమ్మ కుయ్యో మనంగా కూలేసి, నన్నీడ్సుకుని పోయె.

ఏడకు? – ఆ మేడకాడికి – ఏ మేడంటావా – ఓ ముసిలి జులపాలాయన మక్కెలిరిగిన ఆంబోతల్లె లోగిలి కంబాని కానుకుని ఇకిలిస్తూ కూకుని అంటడే – అద్దది – ఆ మేడ: ఆ చింబోతు మా అయ్యకు ఎరికే నంటావా – కాదు– పుంతలో మాకో దిబ్బ మొగమోడు తగిలినాడు – మా అయ్యవోలకం సూసి – ఏందీ కథ, ఎందుకట్ట పడుసును గుంజుతవ్, నీకేం గావలె యీ గుజ్జు అంటూ మాట కలిపినడు.

మా అయ్య మూతి బిగింపు మీదుండడు. అదు మాట సేసుకొంగనే పోరా బేపీ, అన్నట్టు తలిసిరినాడు – కాని, పువాకు పాయ సేతికివ్వంగనే, సప్పబడినాడు.

కూటికి నూకల్లేవు – నూకలికి రూకల్లేవు. మరి బగవంతుడు సెప్పేనన్నాళ్ళు బతకాలిగంద! సంతకు బోతుంటనన్నడు మా అయ్య.

సరుకో –

సేతనే ఉందిగా–

నికార్సైనా–

కాక – మరెందనుకుండవ్. యెన్న గాచిన నెయ్యి.

మారుబేరమా–

సొంతసొమ్మే – కట్టుకున్నదాని కడుపు నుట్టింది – ఇంత లెక్కమేపి, ఏపు సేసినా–

అటనే – అటానే – కూతురికి కూడెట్టి, సెడి అమ్ముకుంటుండ వన్నమాట–

అదేంకూత మడిసీ, సేతగాని శెట్టి వదరు బోతడుగాని, మన కమామీషు నీ కెరికలే – పైసా యెరేసి పరక గుంజుకునే మొగోడి నయ్యోవ్ – ఏమనుకుంటుండవో.

ఓరి నీయాలి కడుపున కవలపిల్ల లుట్ట! – సెయ్ దిరిగిన వోడివే – మరి, సెప్పే దో మాట!

నీ వుచ్చుగుంటావా...

నాకుండ తొంబ సాలకనా – కలిసొస్తే నేనూ ఓ రెండు రాళ్లు సేసుకుందమని – సెప్పొద్దూ మన్లోమాట – నాకీ యాపారంలో లగువ్వూ, బిగువ్వూ తమాం దెలుసు. సిసలైన ఖామంద్ కాడకు తోడకపోతా – నీవు చుప్‌నుండు, ఐసా పైసా నేం జూసుకుంట...

–ఇట్టా, ఆ మదుసు లిద్దరూ కూడబలుక్కుని, నన్ను కొంచుపోయిన్రు: ఆకడ ఆ జులపాలోడు, ఎగజూసి దిగజూసి జబ్బపట్టిసూసి, సెంపలు పిండిసూసి – ఇకిలించినాడు: అళ్లూ అళ్లూ నాకు ఇనుకోరాకుండ గుసగుసలోయి, రూకలు ఎన్నుకుండరు. అవ్వా, గొడ్డు నమ్ముకున్నట్టు బిడ్డ నమ్ముకున్నడు – మా అయ్య – పోస్లే కడుపులో మంట కానరాని మంటగదా – ఇంక ముప్పొద్దులూ నా పేరు జెప్పుకుని, ఉడుకునీలోసుకుని ఏడీ యెచ్చనా దింటరు. నే నందుకన్లే – పోతూ పోతూ, మా అయ్య, నా మొగంకేసి సూడరాదా! యెల్తుండనని సెప్పరాదా –

నిన్నో నీడకు నేర్సిన – ఆ మడిసిని నమ్ముకుని సల్లంగ బతకమని అనరాదా – ఉహూఁ – అనలా – నే మడిసినా మాకునా, అని కుమిలిపోయిన.

కాని, అవ్వా – ఆ జలపాలాయన – మణిసికాడు – దేవుడు: నేనట్టా గుసుగు – గునుగుమంటూ కూలిపోంగా, ఆ అయ్య నా కాడకొచ్చి, మీద సెయ్యేసి, యెక్కెక్కి నవ్వినడు – బిడ్డా అన్నడు – భగవంతుడు మమ్మల్ని ఒంటిరెక్క పచ్చుల్ని చేసినడు, నట్టింట తొట్టికట్టలా – సేత బిడ్డనెత్తలా ఇట్టానే ముమ్మారు బిడ్డల్నుచ్చుకున్న – కాని, నీడ నుండంగనే నెయ్యా బువ్వా వంటపట్టంగనే –బిడ్డలకు పుట్టరాని బుద్ధులుట్టుకొచ్చినయ్ – సేతి కందిం దట్టుకొని, ఎగిరిపోయిన్రు. ఆ బతుకుల కంతే ప్రాపతం అనుకుండ ఇప్పటికి ఏకీ సాలాయె ఇంక మాకీ గంతర బింతర కూడదనుకున్న – కాని బిడ్డా నే నూరుకున్నా, దైవం ఊరకుండలా – నిన్నిచ్చినాడే – అన్నా డవ్వా –

ఇంటివిగంద – నన్ను కన్నోడు – బిడ్డా అని, బతుకున్నంత లెక్కా పిలవాల్సినోడు – అమ్ముకుంటడా ముక్కూ మొగం ఎరగని మడిసి – బిడ్డా అంటడా – ఏం దవ్వా యీ యిసిత్తరం – నాకు మతోయింది – పలవల్లాడి పోయిన – ఆ అయ్య పాదాలట్టుకున్న: అయ్యా, పుట్టి బుద్దెరిగినాక, మా అయ్యిట్టా పిలవలా, మా అమ్మిట్టా పిలవలా, ఆకలే అమ్మా, అని గొంతు సించుకుంటే మా యమ్మ మూకుడులో ఎండు మెతుకులు రాల్సి నీది దయ్యపాకలే అని మొట్టేది – నాకు ఏడుపొస్తే, మా అయ్య నడురగ దన్నేవోడు: కూడు లేక ఎట్టా బతుకుతానయ్యా – దగమోపైంది – ఆ యమ్మ, నాయమ్మ నడుక్కోని తినేదాన్ని – అందుకూ మా అయ్యకు రోసముట్టుకొచ్చె – తాను మారాజంట, నే నడుక్కు దింటే తనకు తలొంపులంట – గుంజకు కట్టి పడేసిండు – అయ్య పెట్టడాయె – అడుక్కు తినద్దంటడయె – నీలు దాగి బతికి నానయ్య...

అని గోడు సెప్పుకుంటూ గోలెట్టిన: ఆ అయ్య కన్ను దడిసి గావురుమన్నడు. అవ్వా ఆకడ మారాజు బిడ్డల్లే బతికిన. కడుపునిండ కూడాయె, కంటినిండ నిదరాయె – బంతిపువ్వల్లె ఏపు దేలినా –

కాని, అవ్వా సూరులేని సుట్టుగుడిసెలో పుట్టి, నీడలేని బతుకు బతికిన, నిప్పచ్చరందాన్ని నాకా మేలు దక్కలా – ఆ అయ్య, ఆ తల్లి తీర్థమాడ బోయినోరు – తిరిగి లోగిలి సేరుకోలేదు. పెద్దేటిలో, మునక వేయంగనే గండు మీనేసుకు పోయిందిట. సింకిపాతను నేను మిగిలిన – మరిగల్తె, నాకుకూడేది, నీడేది...

సుట్టపోళ్ళంట – లోగిలి కమ్ముకున్నరు – అదేం పాపమో అవ్వా, ముసలోడు – ముతకోడు, నన్ను సూసీ సూడంగనే యికిలింపులుగావు, యికయికలుగావు – నిదరోదమని, ఓ మూల పండుకుంటె – పరువుమాలిన కూతగూసిరి – సేయి అంకించుకున్రి – ధూత్తెరీ అంటిని – తన్ని తగిలేసిరి – ఏడకు బోయేది.

ఎండనుబడి యెండిన – యెవడికాడు యెగాదిగ సూసేవోడే – సీకటిలో దాక్కున్న – బిగిలూదేవోడు – లానా కీడ్చుకుపోయె – అవ్వా, రేతిరంత ఒక్క నరకం అనుకో – నట్టడివిలో రగతం తావే సింగం, సివంగీ మెరుగవ్వా – బస్తీలో నరమానవుడి కన్న అవి పాపజాతి కావవ్వా – పొద్దొడవంగనే – అయ్యను

తోడుకొచ్చి, నన్నప్పగించిరి – మళ్ళీ పాటు మొదలాయె – మా అయ్య నన్నేడకో గుంజుకు పోతుండె –అమ్మకు తిందమని – నా బతుకింతే గంద అనుకుండ – అయ్యా, ఆ మారాజుకాడ రూక లుచ్చుకుంటివే – నీ సొత్తు అరికిస్తివే – మళ్ళీ ఎట్టా అమ్ముకుంటవయ్య – అంటిని – మా అయ్య సాచి ఒకటుచ్చుకున్నడు – నీ కిది దరమం కాదయ్యా అంటిని – రెండుచ్చుకున్నడు – సుక్క మీదున్నడేమో మణిసి తూలుతున్నడు: నా మొగాన తుబుక్కుమన్నడు. అవ్వా, నాకుగ్రం వచ్చె – ఆ జీవానొక్క తోపుదీసిన – కూలిపోయిండు – పరుగుచ్చుకున్న.

అవ్వా – కన్నవోడు అమ్ముకుంటాడా – బిడ్డా అని సేరదీసిన మారాజు నీట గలిసి పోతడా – యింక అడకూతురు ఎట్టా బతకాలి. లోతు సూసుకుంద మనుకున్నా – మూడు మునకలేస్తే ముప్వు సెలిపోతుంది గద – ఏమంటవు...

...ఓసి కూనా బతకమంటనే – నర మానవుడంటె – ఎవడే, అడకూతురి కడుపున పుట్టినోడే, – మనం యెత్తి పెంచినోడే – జోలపాడితే నిదురోయేవాడే, బిడ్డా – మనం సాకిన గొర్రె పొట్టేలుకు కొమ్ముల్ దిరిగి దూకుడు సేస్తే – బెదిరి పోతామా – సిట్టుండలెట్టి మేపిన పుంజు, కొక్కిరాయిగా తన్నబోతే సెదిరిపోతమా – ఎన్నెమ్మ పురుక్కి, నెత్తడిసే బుద్ధి – సెంపలేసుకుని సేయెత్తి మొక్కితే దానిగుణం మారుతుందా – సెప్పున కొట్టాలిగాని – నరంలేని నరమానవుడూ అంతే – మంచికిబోయి – మా అయ్యవురా అంటే అమ్ముకుదింటడు – మనసోయిందిరా – సక్కనోడా అంటే – కాళ్ళకాడ కూలేసి, సిగపాయ ఒడిసి పట్టుకుంటడు.

నిన్ను నమ్ముకుంటిన్రో అంటే – లోకువజేసి బూతుకూత కూస్తడు – నీ సిత్తమంటే సేయిసురుతడు. మనం కస్సుమంటే సేయెత్తి సలాం గొడతడు – పోరా బచ్చా అంటే – జీ బేగంసాహెబా అంటడు – బద్మాష్ అంటే – సెబాస్ అంటడు – అదీ వాడి పుటుక – అదీ వాడి బుద్ధి – కూనా – అడకూతురికి – ఓ కంట యెన్నెలుండాలి, ఓ కంట కత్తులుండాలి – గొంతులో కోయిలుండాలి – కొరడా లుండాలి – ఒక సేత పప్పూ పాశెం – ఒక సేత నూరిన బాకూ – అట్ట బతకాలి – గుబుల్ దిప్పితే నరమానవుడు – మనకు గులామే; మాలిక్ కాడే. కూనా – ఫికర్ నయ్ – యిది యాదుంచుకు బతుకు.

★ ★ ★